విస్తారంగా నువ్వుల పంట

- 10 వేల ఎకరాల్లో సాగు
- రబీలో లాభదాయకం
- ఆరోగ్యంతోపాటు రైతులకు ఆదాయం
- శాస్త్రవేత్తల సూచనలు,సలహాలతో అధిక దిగుబడి


గొల్లపల్లి మండలంలో సాగవుతున్న నువ్వుల పంట

గొల్లపల్లి: జిల్లాలో నువ్వుల పంట విస్తారంగా సాగవుతోంది.నూనె గింజల పంటల్లో ప్రధానమైన ఈ సాగుతో స్వల్పకాలంలోనే అధిక లాభాన్ని ఆర్జించవచ్చు. వేసవిలో ఆరుతడి పంటగా వేయడం వల్ల విత్తన నాణ్యతతో పాటు అధిక దిగుబడి వస్తుంది. చీడపీడల సమస్య ఉండదు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.

జిల్లాలో 10వేల ఎకరాల వరకు రైతులు నువ్వ సాగు చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సిబ్బంది అంచనా వేస్తున్నారు. ప్రధానంగా నువ్వుల్లో 45 నుంచి 55 శాతం వరకు నూనెతో పాటు, 20 శాతం ప్రోటీన్లు ఉంటాయి. పలు రకాల యాంటీ ఆక్సిడెంటల్లు కలిగి ఉండటంతో ఎక్కువ రోజులు నిల్వ ఉండడమే కాక వ్యాధి నిరోధక శక్తిని పెంచుతోంది. నువ్వు సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. నీరు నిలబడని తేలిక నేలలు, బరువు నేలలు నువ్వ సాగుకు అనుకూలంగా ఉంటాయి. నువ్వులు జల్లుకునే ముందు ఎకరాకు 4 టన్నుల పశువుల గెత్తం, 16 కిలోల నత్రజని, 8 కిలోల పోటాష్ ఎరువులను భూమిలో చల్లుకోవాలి. మెత్తని దుక్కు చేసుకుని నేలను చదును చేసి నువ్వులు జల్లుకుంటే మొక్కలు మొలకెత్తడానికి నీటి తడులు సమానంగా ఇవ్వడానికి అనుకూలంగా ఉంటుంది. నువ్వుల్లో 1020 జేసీఏ, శ్వేత, తదితర విత్తనాలను రైతులు ఎంపిక చేసుకుని వినియోగించాలి. ఈ రకాలు, 75 నుంచి 90 రోజుల్లో పంట కాపుకు వస్తుంది.ఎకరాకు 400 నుంచి 600 కిలోల వరకు దిగుబడి వస్తుంది. ఎకరాకు 2 నుంచి 4 కిలోల విత్తనాన్ని ఇసుకతో కలిపి చల్లుకోవాలి. మొక్కల మధ్యన 15 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. విత్తనం వేసిన తరువాత పూత దశలో,కాయ దిగి గింజ కట్టేదశలో నీటి తడులు ఇవ్వాలి. ఆకులు పసుపురంగులో మారినప్పుడు, 75 శాతం కాయలు లేత పసుపులోకి వస్తే పంట కోత కోసి కట్టలుగా కట్టుకుని తలకిందులుగా కుప్పలు పెట్టుకోవాలి. 5–6 రోజులు ఎండిన తరువాత కర్రలతో కొట్టి చేను చేసుకోవాలి. గింజల్లో తేమ శాతం 8కి తగ్గేవరకు ఎండలో ఎండబెట్టి గింజలను జాగ్రత్త చేసుకోవాలి.

తెగుళ్ల నివారణ ఇలా..

- విత్తనాలు జల్లే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్, మాంకోజెట్‌తో విత్తనశుద్ధి చేసి చల్లుకుంటే నేలలో 21 రోజుల వరకు తెగుళ్లు రాకుండా జాగ్రత్త పడవచ్చు.
- నువ్వుల్లో ఎక్కువగా రసం పీల్చే తెగుళ్ల నివారణకు మోనోక్రొటోపాస్ 3 మిల్లీ లీటర్ల మందును లేదా డైమిథిమేట్ 2 మిల్లీ లీటర్ల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వేరుకుళ్లు, కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా మాంకోజెట్ 3 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- గింజలకు పురుగు పట్టకుండా కిలో విత్తనానికి వేప నూనె 25 మిల్లీ లీటర్ల,బూడిద 25 గ్రాములు కలిపితే పురుగు పట్టకుండా ఉంటుంది.

ముందస్తు మహిళా దినోత్సవ సంబరాలు


జగిత్యాలలో మహిళా దినోత్సవ సంబరాల్లో మహిళలు


కోరుట్లలో మహిళల ఆనందం

జగిత్యాలటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని వీకేబీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. వివిధ రంగాల్లో అత్యున్నత సేవలు అందించిన మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, నాయకులు రంగు గోపాల్, మమత, సురతాని భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని ఆర్యవైశ్య మహిళా సంఘ సభ్యులు ముందస్తు మహిళా దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో ముక్క రజిత, బుడికే లావణ్య, కంటాల అనితా దేవి, కోటగిరి శైలజ, నీలి స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని కేజీబీవీ పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం మైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ప్రసాదరావు, హెచ్ఎంలు కరుణశ్రీ,హైమద్ పాల్గొన్నారు.

రాయికల్: భారతదేశంలో ఆత్మగౌరవానికి ప్రతీక అతివలు నిలుస్తారని తాపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌రావు అన్నారు. బుధవారం రాయికల్ మండలం అల్లీపూర్‌లో తాపస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలోని పాత హరిజన వాడ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందస్తు వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమానికి చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుసుమ, అంగన్‌వాడీ టీచర్ బేర మరియ తదితరులున్నారు.

క్లుప్తంగా

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన


రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మెట్‌పల్లి: ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు అందుకు భిన్నంగా చర్యలు చేపట్టడం సరికాదన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు బోయిన్‌పల్లి చంద్రశేఖర్‌రావు, రాణవేని సత్యనారాయణ, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డైరీ రాయడం మంచి అలవాటు


డైరీ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జగిత్యాల: విద్యార్థులు డైరీ రాసుకోవడం మంచి అలవాటని మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. బుధవారం కళాశాలలో టీజీసీ జీటీఏ డైరీ ఆవిష్కరించి మాట్లాడారు. మానవుని జీవితంలో డైరీకి ప్రత్యేక పాత్ర ఉంటుందని, తనను తాను మలుచుకునే శక్తి కేవలం చదువుకున్న మానవుడికే ఉంటుందని, అందులో డైరీ రాసుకోవడం కూడా ఒక అలవాటు అన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో సత్యప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, పడాల తిరుపతి, మస్రూమ్ సుల్తానా, జ్యోతిలక్ష్మీ పాల్గొన్నారు.

సమస్యలు పట్టించుకోవడం లేదు

జగిత్యాల: మున్సిపల్ కమిషనర్ సమస్యలను పట్టించుకోవడం లేదని, ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ ఆరోపిస్తూ అదనపు కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటేషన్, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై డబ్బులు లేనిదే ఫైల్‌పై సంతకం చేయడం లేదంటూ ఓ అధికారిపై కౌన్సిలర్లు సంతకాలు సేకరించి ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. డీజిల్‌పై అక్రమాలు అనేకంగా జరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. జగిత్యాలలో కుక్కలు, కోతుల బెడద అనేకంగా ఉన్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న వాణిశ్రీ

మెట్‌పల్లి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారి వాణిశ్రీ అన్నారు. పట్టణంలోని పలు కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో లబ్ధిదారుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. తక్కువ బరువు ఉన్న చిన్నారులను గుర్తించి వారు బరువు పెరగడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఐసీడీఎస్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట సీడీపీవో తిరుమలాదేవి ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు


నవీన్

మెట్‌పల్లి: మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నవీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా ఉన్న లక్ష్మీనారాయణను బదిలీ చేసి ఆయన స్థానంలో రామగుండం ఎస్‌బీలో పని చేస్తున్న నవీన్‌ను ఉన్నతాధికారులు నియమించారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మల్యాల సీఐ..


నీలం రవి

మల్యాల: మల్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నీలం రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం, కొడిమ్యాల ఎస్సై సందీప్, పెగడపల్లి ఎస్సై రామకృష్ణ సీఐని మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మంగళారపు మహేశ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సభ్యులు పలు సమస్యలను లెవనెత్తారు. ప్రస్తుతం యూరియా కొరత తీవ్రంగా ఉందని, మార్క్‌ఫెడ్ గోదాముల్లో యూరియా ఉన్నా అధికారులు సహకార సంఘాలకు సరఫరా చేయడం లేదని సింగిల్ విండో చైర్మన్లు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ నీరు రావడం లేదని జాబితాపూర్ ఎంపీటీసీ చిత్తారి స్వప్న అధికారులను నిలదీశారు. గుల్లపేటలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు లీకేజీ అవుతున్నా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ దమ్మ సురేందర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మరమ్మతులు చేపట్టి, నీటి సరఫరా జరిగేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యూరియా కొరత ఉందని తెలిసి అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. 9 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడు యూరియా కొరత రాలేదన్నారు. గతంలో 70 ఏళ్లలో 32 ట్యాంకులు కడితే రాష్ట్రం ఏర్పాటు తర్వాత మండలంలో 29 కొత్త ట్యాంకులు నిర్మించినట్లు పేర్కొన్నారు. యాసంగి పంట పెట్టుబడి సాయం అందించడంలో జాప్యం జరిగిందని, ఇప్పటికీ 60 మంది రైతులకే పెట్టుబడి సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఉపాధిహామీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, కాలువల్లో పూడికతీత తీయడం వల్ల చివరి ఆయకట్టు వరకు నీరు అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీ మేరకు ఉపాధిహామీ కూలీలకు రోజురూ.300 చొప్పున 150 పనిదినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంమోహన్, ఎంపీడీవో రమాదేవి, సూపరింటెండెంట్ గంగాధర్, ఎంపీవో రవిబాబు, సింగిల్‌విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు పాల్గొన్నారు.

మోతేలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: నవభారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం మోతే గ్రామంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ భారతదేశానికి పరిమితం కాకుండా ప్రపంచంలో ఒక గొప్ప విద్యావేత్తగా మనుగడ పొందినటువంటి గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్, సురకంటి స్వప్న, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీకివినతి

రాయికల్: మండలంలోని రామాజీపేటలో మున్నూరుకాపు సంఘానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నిధుల మంజూరుకు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎనుగంటి రవి, కోల రాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు చైతన్యంగా ఉంటేనే గుర్తింపు


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్

కథలాపూర్: బీసీలు చైతన్యంగా ఉంటే అన్ని రంగాల్లో ప్రాధాన్యత లభిస్తుందని, అందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో జనాభా ప్రకారం బీసీలకు ఎంపీ టికెట్లు ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను డిమాండ్ చేశారు. ఓట్ల కోసం బీసీలను వాడుకుని ఆ తర్వాత విస్మరించాలని చూసే పార్టీలకు గుణపాఠం తప్పదన్నారు. వచ్చే పార్లమెంట్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీ టికెట్లను బీసీలకు ఎక్కువగా ఇవ్వాలన్నారు.

బీసీ సంఘం మండలాధ్యక్షుడిగా జలంధర్

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా తాండ్ర్యాల గ్రామానికి చెందిన పాలెపు జలందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా అంబారిపేట గ్రామానికి చెందిన చిలుక వెంకటేశం, మండల కన్వీనర్‌గా గడ్డం రాకేశ్, కార్యవర్గసభ్యులను జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ సన్మానించి అభినందించారు.

మోదీ హయాంలోనే మహిళల అభివృద్ధి


మాట్లాడుతున్న సత్యనారాయణ రావు

కోరుట్ల: ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనే భారత దేశంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణ రావు అన్నారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మండపంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో శక్తి వందన్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ మోదీకి మద్దతుగా నిలిచి బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు, గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు పంచిరి విజయ్ కుమార్, బీజేపీ, బీజేవైఎం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కుల సంఘ భవనాలకు నిధులు మంజూరు

కోరుట్ల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో కుల సంఘ భవనాల అభివృద్ధికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణ రావు కుల సంఘ నాయకులకు బుధవారం ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు పంచిరి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘం భవనానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘ భవనానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంఘ భవన నిర్మాణానికి సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర నాయకుడు అనూప్ రావు, ఐఎంఏ కోరుట్ల అధ్యక్షుడు రేగొండ రాజేష్, కోశాధికారి అన్వేష్, డాక్టర్లు పాల్గొన్నారు.


శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పెగడపల్లి: మండల కేంద్రం పెగడపల్లి శ్రీస్వయంభూ రాజరాజేశ్వర స్వామి మండలంలోని వెంగళాయిపేట శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యే పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు శివ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

ధర్మపురి: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలను ముస్తాబు చేసారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం శ్రీరామలింగేశ్వర స్వామి, అక్కపెల్లి శ్రీరాజరాజేశ్వర స్వామి, మండలంలోని నేరెల్ల సాంబశివ ఆలయాలను రంగులు, విద్యుద్దీపాలతో అలంకరించారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవం ఉంటుంది. అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో చైర్మన్ సీపతి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం శివపార్వతులకు కల్యాణం నిర్వహిస్తారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్గటూర్: మండల కేంద్రంలోని ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అమరేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం శివపార్వతుల కల్యాణం కన్నులపండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శివపార్వతుల ఉత్సవమూర్తులకు వేద బ్రాహ్మణుల చేత కల్యాణ క్రతువు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణం వీక్షించారు. అనంతరం అన్నదానం చేశారు. ఉత్సవాల్లో భాగంగా నేడు ఆలయంలోని ఆవరణ దేవతలకు జలాభిషేకం, శుక్రవారం శివరాత్రి ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్ధరాత్రి నిషిపూజ, అహోరాత్ర యాగం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు విద్యాసాగర్ శర్మ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో ఉపాధిహామీలో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. అంతర్గత రహదారులను మెరుగుపరిచేందుకు ఈజీఎస్ నుంచి రూ. 10 లక్షల నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ షంశేర్ అలీ, ఎంపీటీసీ లచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి నిఖిల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మధ్యాహ్నం 12గంటలకు ప్రారంభమైన సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు రాకపోవడంతో ఒంటి గంట వరకు వేచి ఉన్నారు. అప్పటికీ ఎవరూ రాకపోవడంతో కోరం లేక సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి ప్రకటించారు.

బుగ్గారం సర్వసభ్య సమావేశం..

బుగ్గారం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నర్మాల రాజశేఖర్ మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై మృతి చెందగా, అతడి మృతికి సంతాప సూచకంగా సమావేశాన్ని వాయిదా వేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ శివారులో అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మల్లాపూర్ మండలం మొగిలిపేట నుంచి రాపని రమేశ్ తన ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తుండటంతో పట్టుకుని ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పంటల సాగుకు శాస్త్రవేత్తల సలహాలు

మల్యాల: పంటల సాగుకు రాష్ట్ర వ్యాప్తంగా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పొందే అవకాశం రైతులకు లభించిందని అధికారులు అన్నారు. రైతునేస్తం ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించగా, మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు, వ్యవసాయ శాఖ బుధవారం అధికారులు తిలకించారు. ఏవో చంద్రదీపక్, జ్యోతి, పాక్స్ చైర్మన్లు రాంలింగారెడ్డి, శోభ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రెండు ఉద్యోగాలకు ఎంపికైన కార్యదర్శి

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేశాపూర్‌లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మౌనిక 2 ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. గతేడాది జరిగిన లైబ్రేరియన్ ఉద్యోగ పరీక్షల్లో డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్‌గా, పాఠశాలల్లో లైబ్రేరియన్ గా ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. మౌనిక భర్త రమేశ్ బాబు నిజామాబాద్ కలెక్టరేట్ లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా వెంకటాద్రి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన నాంపెల్లి వెంకటాద్రిని నియమిస్తూ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు అందె మారుతి బుధవారం నియమాక పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో కోరుట్ల కాంగ్రెస్ సేవాదళ్ ఇన్‌చార్జి బెజ్జారపు భూమచారి, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

సారంగాపూర్: సారంగాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీపీ జమున, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాచారం..

విద్యానిధి పథకానికి దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాల: 2023–24 సంవత్సరానికి గాను ప్రభుత్వం విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఈనెల 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు సౌత్ కొరియా, సింగాపూర్, అమెరికా, జర్మనీ, జపాన్, కెనడా, యూకే, దేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలనుకునే వారికి మంచి అవకాశమని, అర్హత గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ బుధవారం తెలిపారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని, అదేవిధంగా 7 నుంచి 10 తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాల కోసం 99125 52338 సంప్రదించాలని కోరారు.

నేడు కథలాపూర్ మండల సభ

కథలాపూర్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ జవ్వాజి రేవతి తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

కథలాపూర్: మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఉంటుందని ఆ పార్టీ నాయకులు కల్లెడ శంకర్, ఎం.డీ రఫీ తెలిపారు. అతిథులుగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు హాజరవుతారని, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలజోన్: జగిత్యాల టౌన్ సెక్షన్–1 పరిధిలోని బైపాస్ రోడ్డులో దేవి శ్రీ గార్డెన్ వరకు రైట్ సైడ్ ఏరియాతో పాటు సాయిరాం నగర్, అష్టలక్ష్మీ టెంపుల్ ఏరియా, వీక్లీ బజార్ స్కూల్ ఏరియా, నాయీబ్రాహ్మణ సంఘం ఏరియాలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–1 ఏఏఈ కె. అశోక్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేషన్ తిప్పలు..



ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేటలో రేషన్ షాపు వద్ద బియ్యం తీసుకునేందుకు కార్డుదారులు సంచులను లైన్‌లో ఉంచారు. బుధవారం ఉదయం 8 గంటల వరకే రేషన్‌షాపు వద్దకు కార్డుదారులు వచ్చినా.. డీలర్ రేషన్ షాప్ తీయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ప్రతీ రోజు సమయపాలన లేకుండా షాప్ తీస్తున్నాడని కార్డుదారులు తెలిపారు. డీలర్ సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.